# లోగుట్టు పెరుమాళ్ళ కెరుక!

-ఎల్.ఆర్.స్వామి



కొంత దూరంలో రోడ్డు మీద గుమిగూడివున్న జనాన్ని చూసి, రోడ్డు మలుపు తిరగకుండా తిన్నంగా గుంపు వైపు నడిచాను నేను.

శుక్లపక్షపు రోజులవి. అంతవరకు తన తల్లి ఐన ప్రపంచానికి లేలేత వెన్నెలని అందించిన పంచమి చంద్రుడు, తుదిశ్వాస విడిచి ఆకాశాన నిర్జీవంగా పడి వున్నాడు.

రోడ్డు చీకటిగా ఉంది గుంపులో వున్నవారి మోములు అస్సలు కనబడలేదు. కాని ఒక పాతిక ముప్పది మంది వుంటారని అనిపించింది.

"ఏమైందిరా....." దగ్గరకు వెళ్ళేకొద్దీ గుంపులోని జనాల మాటలు వినబడ్డాయి. ఒక ఆమె సన్నటి ఏడుపు కూడా వినిపించింది.

"బొట్టు కునుకేసిందిరా...."

"జ్వరం కాని వచ్చినాదా ఏమిటి...."

"తెలవదురా, తిండి కక్కేసినాదటరా. ఓ నాలుగు సార్లు కొండకెళ్లి వచ్చినాదట."

"మరి డాక్టర్ బాబు.... ఏదో చెప్పబోయే అతను నన్ను చూసి ఆగిపోయాడు. దారి ఇవ్వండిరా. అమ్మగోరు వచ్చినారు."

గుంపులో వున్నవారు సాదరంగా జరిగి దారి ఇచ్చారు. వారంతా మా ఇంటి వెనుక వున్న కొండ వారగా వుండి కూలి చేసి బ్రతికేవారే!

నేను ముందుకు అడుగులు వేసాను. ఎదురుగా పాకముందు కాలు జాపుకుని కూర్చొని వుంది ఒక ఆమె- ఆమె ఒళ్ళో ఒక పాప - పాకలో ఒక గుడ్డి దీపం.

ఆరిపోయే గుడ్డిదీపం వెలుగులో దూరం నుంచి ఆమెని పోల్చుకోలేక పోయాను, నేను. దగ్గరకు వెళ్ళగానే నా గుండె గతక్కుమంది. ఆమె మా ఇంటిలో పని చేసే రామాయమ్మే!

"అమ్మగోరు....." నన్ను చూసిన రామాయమ్మ బోరుమంది.

"నా బొట్టు.... నా బొట్టు... నాకు...."

నాకళ్ళు నిండాయి. కర్చీఫుతో కళ్ళువొత్తుకున్నాను. రామాయమ్మ ఒళ్ళో పడుకొని ప్రశాంతంగా నిద్ర పోతున్నట్టు ఉంది పాప!

ఒక రెండునెలలక్రితం వరకు సత్తిగిన్నె పుచ్చుకొని రామాయమ్మ వెనుక వచ్చేది, ఆపాప.

చాలా చలాకీగాను, అందంగాను కనబడిన ఆ పాపని చూసి నేను ముచ్చట పడేదాన్ని.

"పాపని బడిలో వెయ్యక నీ వెంట తిప్పు కుంటున్నావేమిటి?" ఒకరోజు రామాయమ్మని అడిగాను. "ఎనిమిదేళ్ళు వచ్చిందని అన్నావుగా."

"నిజమేనమ్మా" రామాయమ్మ అంది. "బడిలో వేసానమ్మగోరు."

"మరి..."

"అది బడికెళ్ళటం లేదమ్మా."

"అలాగంటే ఎలాగ, రామాయమ్మ. నయాన్నో భయాన్నో పంపాలి." రామాయమ్మ మౌనంగా ఉండిపోయింది.

"పిల్లని పనిలోకి కాదు, బడిలోకి పంపాలని చెప్తున్నారు కదమ్మా" నేను మళ్ళీ అన్నాను.

"నిజమేనండి అమ్మగోరు. వెళ్ళనని మొండికేస్తే ఏం చేస్తామమ్మగోరు. బడిలో నుంచి పారిపోయి వస్తుంటేను...." గిన్నెలు తోమిన చేతులు కడుగుకొని అంది రామాయమ్మ.

"గుర్రాన్ని నీళ్ళకాడికి తీసుకెళ్తాం గాని నీళ్ళు త్రాగించలేం కదండి."

నేను ఏమి అనలేదు. ఆ తర్వాత పిల్లని మా ఇంటికి తీసుకురాలేదు రామాయమ్మ.

"నాకెంత కష్టం వచ్చినాదె తల్లే....." రామాయమ్మ గుండెలు బాదుకొని ఏడుస్తోంది.

"ఊరుకో, రామాయమ్మ ఊరుకో" నేను మెల్లిగా జరిగి రామాయమ్మ భుజంమీద చెయ్యి వేసి అన్నాను.

"జరిగినదేదో జరిగిపోయింది. ఊరుకో"

"ఎలా ఊరుకుంటాను తల్లే. నన్ను నట్టేటిలో ముంచినాదె తల్లే.... నా బాధ ఎవరికి చెప్పుకోవాలో...."

ఏం మాట్లాడాలో తోచలేదు నాకు.

రామాయమ్మ వెనకున్న కొడగట్టే దీపం వొత్తిని ఎగదోస్తున్నాడు రామాయమ్మ భర్త.

"బడికెళ్ళినా బాగుండేది నా తల్లే.... నన్నిలా ముంచేస్తుందని అనుకోలేదు తల్లే....." రామాయమ్మ ఏడుస్తూనే వుంది.

రామాయమ్మ దుఃఖం నా మాటలకు తగ్గదని అనిపించింది, నాకు. అక్కడ నుంచి బయలుదేరితే మంచిదని అనుకున్నాను.

"అలా ఏడిస్తే ఎలా రామాయమ్మ." నేను అన్నాను "కడుపుకోత భరించడం కష్టమే. ఐనా ఓర్చుకోవాలి."

"నేనెలా ఓర్చుకుంటాను తల్లే. దాన్ని పనిలో పెట్టి తీసుకున్న రెండువేలు నేనెలా తీర్చాలి తల్లే..."

నా బుర్ర తిరిగిపోయింది.

రామాయమ్మ ఏడుపు పిల్ల పోయినందుకన్నా పిల్లని పణంగా పెట్టి తీసుకున్న రెండు వేల రూపాయల అప్పు గురించని తెలిసిన నేను అక్కడ నిలబడలేకపోయాను.

లోగుట్టు పెరుమాళ్ళ కెరుక ! ★

## సమాధానాన్నిచ్చుకుంటూ

**రామశాస్త్రి ఎస్.వి**

నువ్వు నాకుపరిచయమయ్యే వరకు
నేనో స్వేచ్ఛావిహంగాన్ని
కావాలనే నీ వలలో వచ్చి వాలాను
బందీనయ్యాను
రసోదయమైన క్షణమే
తెలిసిందీగాయం
గాయమైనా, గేయమైనా
ప్రశాంతంగా కూర్చోనివ్వదు
నా స్థితీ అదే
అంతా నువ్వే
చూసే ప్రతి దృశ్యంలోనూ,
ఆలోచనల్లోనూ
అంతా నువ్వే అయితే
నేను ఓ ప్రశ్నార్థకం
ఏం చెప్పినా నీతో ప్రారంభించి,
నీతోనేముగిస్తున్నా
నీగురించి చెప్తే నాగురించి చెప్పినట్లేగా
ఇప్పుడంతా నీ గురించే
అంతా నువ్వైన నా కవిత్వం గురించే
ఇప్పుడు
నువ్వే నా శక్తి
నువ్వే నా ఆశక్తి
అందుకే
కవిత్వం నా వ్యసనం
కవిత్వం నా గానం
కవిత్వం నా ప్రాణం

జర్మిసాల్....జెర్మిసాల్
మినీ కవితల పోటీ వివరాలు
ఏప్రిల్ 2006 సంచికలో..